సుదూరంలో విద్య..!

- డీడీఈ విద్యార్థులతో ఎస్వీయూ అధికారుల ఆటలు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో వికృత పోకడలు
- హాల్ టికెట్లు అందించి పరీక్షలు వాయిదా
- సతమతమవుతున్న 32 వేల మంది విద్యార్థులు

ఎస్వీయూ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో సతమతమవుతున్నారు. సోమవారం ప్రారంభంకావాల్సిన దూర విద్య యూజీ.. పీజీ పరీక్షలను వాయిదా వేయడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. హాల్‌టికెట్లు సైతం అందించి మోసం చేయడంపై మండిపడుతున్నారు. వర్సిటీ అధికారుల వ్యవహారశైలిపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు పరీక్షలను వాయిదా వేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – తిరుపతి సిటీ



జీవితాలతో ఆటలా..!



వర్సిటీలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. అధికారులపై కొంతమంది ఒత్తిడి చేసి వివాదాస్పద నిర్ణయాలకు పురిగొల్పొతున్నారు. దీంతో ఎంతో మంది విద్యార్థులు, ఉద్యోగులు సతమతమవుతున్నారు. డీడీఈ పరీక్షలు పలు మార్లు వాయిదా వేసి అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఎంతో మంది అభ్యర్థులు హాల్ టికెట్లు చేతపట్టుకుని సుదూర ప్రాంతాల నుంచి పరీక్ష సెంటర్లకు హాజరయ్యారు. ఇంత దారుణమైన పరిస్థితి ఏ వర్సిటీలోనూ లేదు.

– శివ శంకర్ నాయక్, జీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్వీయూ

ఎమ్మెల్సీ ఎన్నికల నెపంతో..



డీడీఈ వాయిదా పర్వం వెనుక అవినీతి హస్తం ఉందా..అనే అనుమానం వస్తోంది. ఏ వర్సిటీలో ఇంత దారుణంగా మూడు సార్లు పరీక్షలను వాయిదా వేయలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల నెపంతో వాయిదా వేయడం అన్యాయం. అధికారులు వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదు. ఎంతో మంది విద్యార్థులు, ఉద్యోగులు పరీక్షల కోసం నిరీక్షిస్తున్నారు. హాల్‌టికెట్లు అందించి పరీక్షలను వాయిదా వేశారంటే ఎంత నిర్లక్ష్యమో అర్థమవుతోంది

– సుందర్ రాజు, నల్సా విద్యార్థి సంఘం అధ్యక్షుడు, ఎస్వీయూ

చర్యలు తీసుకోవాలి



ఎస్వీయూ అధికారులు ఇష్టారాజ్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. పరీక్షల షెడ్యూల్‌కోసం ఎదురు చూస్తున్న డీడీఈ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఇప్పటికే మూడు సార్లు వాయిదావేశారు. ప్రస్తుతం హాల్‌టికెట్లు అందించి మోసం పూరితంగా వాయిదా వేశారు. దీని వెనుక ప్రభుత్వంలోని కొందరు పెద్దల ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోంది. ఎంతో మంది ఉద్యోగులు తమ విధులకు సెలవులు పెట్టుకుని పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వారి పరిస్థితి దారుణం. ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్న అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.–బండి చలపతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

అధికారుల నిర్లక్ష్యం



డీడీఈ పరీక్షల నిర్వహణలో అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికే పలు మార్లు వాయిదా వేసి అభ్యర్థులను అసహనానికి గురి చేశారు. ఈ క్రమంలోనే మరో మారు వాయిదా పర్వం కొనసాగించడం దారుణం. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను సర్వనాశనం చేస్తోంది. విద్యారంగంలో ప్రతి నిర్ణయం వివాదాస్పదమవుతోంది. ఇప్పటికైనా అధికారుల, ప్రభుత్వ పెద్దల తీరు మారకుంటే విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. ప్రశ్నపత్రాలను సైతం సంబంధిత పరీక్ష కేంద్రాలకు చేరవేసిన తర్వాత ఎన్నికల కోడ్ నెపంతో వాయిదా వేయడంతో అధికారుల నిర్లక్ష్యం తెలుస్తోంది.

– ఆర్ ఆషా, పీడీఎస్ఓ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

నరకం అనుభవిస్తున్నారు



ఎస్వీయూ అధికారుల వాయిదాల వైఖరితో డీడీఈ పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు నరకం అనుభవిస్తున్నారు. పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేసి, వాయిదా అంటూ సమాచారం అందించడం ప్రభుత్వ, అధికారుల వికృత చేష్టలకు నిదర్శనం. ఇప్పటికే పలు మార్లు వాయిదా వేశారు. పరీక్షల నిర్వహణ, కేంద్రాల కేటాయింపులోనూ విమర్శలు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు వైఖరి మారాలి. లేకుంటే ఉద్యమిస్తాం.

– భగత్ రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

26న ఉచిత యోగధ్యాన శిక్షణ



సుషుమ్న క్రియా యోగ ధ్యానం శిక్షణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: మహాశివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న సాయంత్రం 6 గంటల నుంచి ఎస్వీయూనివర్సిటీ తారకరామ స్టేడియంలో ఉచిత యోగ ధ్యాన శిక్షణ చేపడుతున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు స్మృతికీర్తి, శరత్, మోహిత్ తెలిపారు. ఈమేరకు సోమవారం వారు ఓ ప్రైవేటు హోటల్లో సుషుమ్న క్రియా యోగధ్యానం శిక్షణ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 ఏళ్ల కఠోర సాధనతో గురువుల నుంచి సాధించిన మహాతపస్వి ఆత్మానందమయి అమ్మవారే ప్రజలకు ఉచితంగా సుషుమ్న క్రియా యోగధ్యానంపై శిక్షణ కల్పిస్తారన్నారు. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అర్ధరాత్రి 12 నుంచి 3 గంటల వరకు లింగోద్భవ ధ్యానం జరుగుతుందని చెప్పారు. ప్రవేశం ఉచితమని, పాల్గొన్న వారికి ఉచితంగా రుద్రాక్ష, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు శిరీష, లావణ్య, స్మృతికీర్తన పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్క్‌షాపు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ గణిత విభాగం ఆధ్వర్యంలో వచ్చే నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు వర్సిటీలో జరగనున్న సైన్స్ అకాడమీ లెక్చర్ వర్క్‌షాపు బ్రోచర్‌ను వీసీ అప్పారావు సోమవారం ఆవిష్కరించారు. వర్క్‌షాపులో ఆల్జీబ్రా, ఆల్జీబ్రాయిక్ నంబర్ థీయరీ, టోపాలజీ వాటి అనువర్తనాలపై నిపుణులైన అధ్యాపకులు పాల్గొని ప్రసంగించనున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, వైస్ ప్రిన్సిపల్ పద్మావతి, గణిత విభాగాధిపతి జయసుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



పోలీస్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లాకు సంబంధించి పోలీస్ డైరీ, క్యాలెండర్‌ను ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆవిష్కరించారు. డైరీలో పూర్తి సమాచారం పొందుపరిచారని, ఇది శుభ పరిణామం అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌తో పాటు వారి కుటుంబంలో కూడా ఈ ఈ డైరీ క్యాలెండర్‌ను ఉపయోగిస్తే బాగుంటుందన్నారు. ఇందులో ఏఎస్పీలు, డీఎస్పీలు, పోలీస్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం

తిరుపతి క్రైమ్: అనారోగ్యంతో మరణించిన పోలీసులకు అందాల్సిన సంక్షేమాలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ అనారోగ్యంతో ఈనెల మూడో తేదీన మరణించాడు. అతని భార్య సత్యవతికి ఐఆర్ ఫండ్ కింద రూ.లక్ష, వెంకటగిరి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన వెంకటేష్ భార్య లతకు రూ.లక్ష చెక్కులను అందజేశారు.

భూసమస్యలపై వినతి

పాకాల : మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ కొందరి రైతుల భూములు నోషనల్ ఖాతాలో శ్రీ వరసిద్ధి వినాయకస్వామి పేరుతో 2013లో నమోదయ్యాయని, వాటిని తిరిగి రైతుల పేరుపైకి మార్చాలని ఆమె కోరారు. అనంతరం తహసీల్దార్ సంతోష్‌సాయికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు, మండల నాయకులు పాల్గొన్నారు.

22 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 22 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరిండెంట్ ఎన్వీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ట్రాఫిక్ డీఎస్పీ ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

ఖాళీ స్థలాలకు పన్నులు విధించండి

తిరుపతి తుడా: ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 10 మంది, నేరుగా మరో 28 మంది వచ్చిన వినతులను అందించారు. అలాగే ఆమె 43, 44 వార్డుల్లో పర్యటించి నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలకు పన్నులు విధించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ బహుమానం చెల్లించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ, టీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు, కార్మికులు

తిరుపతి కల్చరల్: టీటీడీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఎఫ్ఎంఎస్ కార్మికులకు లడ్డు, వడ, బ్రహ్మోత్సవ బహుమానం చెల్లించాలని టీటీడీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఎఫ్ఎంఎస్ కార్మికులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో టీటీడీ పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కార్మికులకు లడ్డూ, వడ, బ్రహ్మోత్సవ బహుమానం చెల్లించకపోవడం విడ్డూరమన్నారు. టీటీడీ యాజమాన్యం వెంటనే స్పందించి బహుమానం ఇవ్వాలన్నారు. సీఐటీయూ నేతలు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

మంత్రివర్యా.. యువగళం మూగబోయిందా..!



ఎస్వీయూ ఏడీ బిల్డింగ్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు

తిరుపతి సిటీ: యువగళం పాదయాత్రలో విద్యారంగంలో సమూల మార్పులు తెస్తానని ప్రగల్భాలు పలికిన మంత్రి నారా లోకేష్ ఇప్పుడు నోరు మెదపకపోవడం దారుణమని విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం ఎస్వీయూ పరిపాలనా భవనం ఎదుట కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పలు సమస్యలపై ఉద్యమాలు చేస్తుంటే సీఎం చంద్రబాబు పెళ్లిపేరంటాలంటూ తిరుగుతున్నారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మమంటూ దేవాలయాల సందర్శనలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రి లోకేష్ క్రికెట్ మ్యాచ్‌లు చూసుకుంటూ సంబరాలలో మునిగి తేలుతున్నారని విమర్శించారు. వెంటనే కామన్ పీజీ సెట్‌ను రద్దు చేసి, వర్సిటీలకే పీజీ సెట్‌ల నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే నెల 4వ తేదీన జిల్లాలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలలతో పాటు వర్సిటీలలో బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌ఏ జిల్లా కార్యదర్శి ఆశా అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

నామాల కాలువ గట్టుపై శ్రీవారి విగ్రహ ప్రతిష్ట



శ్రీవారి విగ్రహ ప్రతిష్టాపన చేసిన గ్రామస్తులు

రామచంద్రాపురం (తిరుపతి రూరల్): తిరుపతికి సమీపంలోని రామచంద్రాపురం మండలం నడవలూరు దగ్గర ఉన్న నామాల కాలువ గట్టుపై ఇటీవల లభించిన అతి పురాతన శ్రీవారి విగ్రహాన్ని సోమవారం మధ్యాహ్నం శుభ ముహూర్తంలో నడవలూరుకు చెందిన కృష్ణమూర్తి స్వామి చేతుల మీదుగా ప్రతిష్టాపన చేశారు. ఈ కార్యక్రమంలో సమీప గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా నామాల కాలువలో పుణ్య స్నానం ఆచరించి నామాలు ధరించి గోవింద నామ స్మరణ నడుమ విగ్రహ ప్రతిష్ట చేశారు. అనంతరం పలువురు మహిళలు అన్న ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కృష్ణమూర్తి స్వామి మాట్లాడుతూ టీటీడీ వారు నామాల కాలువను ఆధీనంలోకి తీసుకుని ఇక్కడ చిన్న ఆలయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

మార్చి 5 వరకు పల్లె పండుగ పనులు

తిరుపతి అర్బన్: పల్లె పండుగ పనులను మార్చి 5 లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జాప్యం లేకుండా సీసీరోడ్లు, అనిమల్ షెడ్లు పూర్తి చేయాలని చెప్పారు. సంక్రాంతికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో పనులు మొదలు పెట్టకపోవడంతో జనవరి 31 వరకు గడువు ఇచ్చారు. తర్వాత ఫిబ్రవరి 20 వరకు, తాజాగా మార్చి 5 వరకు గడువు పొడిగించారు. నిర్లక్ష్యం లేకుండా పనులు చేపట్టాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అగరాలలో ఉపాధి నిధులు స్వాహా

- రూ.4 లక్షలకు పైగా కాజేసిన సిబ్బంది
- అధికారులకు తెలిసినా పట్టించుకోలేదంటూ కూలీల ఫిర్యాదు
- గ్రామసభలో బట్టబయలైన అవినీతి బాగోతం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీ మంజులమ్మ

చంద్రగిరి: ఉపాధి హామీ పథకంలో అధికారులు చేతివాటం ప్రదర్శించారు. దొంగ మస్టర్లను సృష్టించి, కూలీల పేరుతో బిల్లులు కాజేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో అగరాల పంచాయతీలో నిర్వహించిన ఉపాధి కూలి పనుల ఆడిట్ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆడిట్ అధికారులు మాట్లాడుతూ... 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీలో సుమారు రూ.10 లక్షల వరకు పనులు జరిగాయన్నారు. ఉపాధి పనులకు హాజరు కాకపోయినా, హాజరైనట్లు సుమారు రూ.60వేల వరకు నిధులను స్వాహా చేసినట్లు తెలిపారు. వరలక్ష్మి, శంకరమ్మ, చీరాలయ్య పనులకు వెళ్లలేదని, అయితే వారి పనులు చేసినట్లు మస్టర్లలో నమోదు చేసి గత ఫీల్డ్ అసిస్టెంట్ కార్తీక్, సీనియర్ మేట్ పుష్ప డబ్బులు తీసుకున్నట్లుగా గుర్తించారు. ఆపై కూలీల వద్ద నుంచి రాతపూర్వకంగా సంతకాలు తీసుకున్నారు.

'జీబీ సిండ్రోమ్' కలకలం

కాణిపాకం/తిరుపతి తుడా : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జీబీ సిండ్రోమ్ కలకలం రేపుతోంది. బీసీజీ లక్షణాలతో ఈనెలలోనే 17 మంది తిరుపతిలోని స్విమ్స్‌లో చేరారు. అందులో ఐదుగురు డిశ్చార్జ్ కాగా 12 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 8 మంది వివిధ జిల్లాల వాసులైతే మిగిలిన నలుగురు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందినవారు. ఈ క్రమంలో పలమనేరు గొబ్బిలకోటూరుకు చెందిన వరలక్ష్మి, గంగవరం మండలం మర్రిమాకులపల్లెకు చెందిన చంద్రప్ప, తిరుపతి జిల్లా భాకరాపేటకు చెందిన రామమూర్తి, చంద్రగిరి రాయలపురానికి చెందిన ప్రసాద్ ప్రస్తుతం స్విమ్స్‌లో చికిత్స తీసుకుంటున్నారు. న్యూరాలజీ నిపుణులు ప్రత్యేక శ్రద్ధతో వీరికి వైద్యసేవలందిస్తున్నారు. ఈ మేరకు ఖరీదైన ఇంజక్షన్లను ఇస్తున్నట్లు న్యూరాలజీ వైద్యులు వెల్లడించారు. అయితే వైద్యం ఖరీదుతో కూడినదైనా భయపడాల్సిన అవసరం లేదంటున్నారు. చికిత్స తీసుకుంటున్న వారి పరిస్థితి నిలకడగా ఉందని స్పష్టం చేస్తున్నారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

వయసుతో సంబంధం లేకుండా.. ఆడ, మగ తేడా లేకుండా జీబీ సిండ్రోమ్ సోకుతుంది. ఇది అంటు వ్యాధి కాదు. 25 శాతం మందికి ఈ వ్యాధి సోకడానికి కారణాలు కూడా తెలియదు. 20 శాతం మందికి దగ్గు, జలుబు వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వస్తోంది. గ్యాస్ట్రో ఎంట్రైటీస్ (జీఈ) ఇన్ఫెక్షన్, డయేరియా వల్ల కూడా వస్తోంది. కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం వ్యాధి సోకిన వారిలో కనిపించే ప్రధాన లక్షణం. ఇది నరాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. తొలుత కాళ్లకు సోకి తర్వాత శరీరంపై భాగానికి ఎగబాకుతుంది. తిమ్మిర్లు ప్రారంభమై కాళ్లు బలహీనపడితే జీబీ సిండ్రోమ్‌గా గుర్తించాలి. తక్షణమే చికిత్స కోసం న్యూరాలజిస్టులను సంప్రదించాలి.

సుద్దాలకు సత్కారం



గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ దంపతులను సత్కరిస్తున్న దళిత ఐక్య వేదిక నేతలు

తిరుపతి కల్చరల్: సినీ గేయ రచయిత, జాతీయ సాహిత్య అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజను దళిత బలహీనవర్గాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా సత్కరించి అభినందించారు. సాహిత్యపరమైన జానపద పాటలకు జీవం పోసిన గొప్ప శ్రామిక జీవన రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. దళిత బలహీన వర్గాల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ టీజీ వెంకటకృష్ణ, సీఐటీయూ నేత కందారపు మురళి, కార్పొరేటర్ ఎస్కే బాబు, రిటైర్డ్ డెప్యూటీ ఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీవో వీ50 స్మార్ట్ ఫోన్ ఆవిష్కరణ



కొత్త వీవో వీ50 ఫోన్‌ను ఆవిష్కరిస్తున్న షోరూం నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తిలక్ రోడ్డులోని వేదం మొబైల్ షోరూంలో సోమవారం నూతన వీవో వీ50 స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించారు. షోరూం అధినేత ఆముదాల ప్రభాకర్ మాట్లాడుతూ ఈ కొత్త మొబైల్ ఫిలిం కెమెరా మోడ్ అండర్ వాటర్ ఫొటోగ్రఫీ సౌకర్యం ఉందన్నారు. 10 శాతం క్యాష్‌బ్యాక్ ఆఫర్ ఉందని, ఫైనాన్స్ సౌకర్యం లభిస్తుందని తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేయూత



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

తిరుపతి రూరల్ : రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతను అందిస్తుందని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు సూచించారు. సోమవారం పద్మావతీపురం పంచాయతీ పరిధిలోని మహిళా ప్రాంగణంలో సంకల్ప్ పథకం కింద సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులకు నిర్వహించే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యూనియన్ బ్యాంకు ఎల్‌డీఎం విశ్వనాథరెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి వెంకటరమణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథంలు పాల్గొన్నారు.

అన్న చెరువు వేలం వాయిదా

తిరుపతి మంగళం : మంగళంలోని న్యూ మంగళం పంచాయతీ మిట్టగాంధీపురం వద్ద ఉన్న అన్న చెరువుకు సోమవారం నిర్వహించాల్సిన వేలం వాయిదా పడింది. అయితే ఉదయం 10 నుంచి 12గంటల వరకు ఈఓ పీఆర్డీ వెంకటరత్నం, కార్యదర్శులు మురళి, నాగరాజు, పంచాయతీ ఉపసర్పంచ్ రామకృష్ణ వేలందారుల కోసం వేచి చూశారు. ఎవరూ రాకపోవడంతో వేలం వాయిదా వేశారు.

గజవాహనంపై కపిలేశ్వరుడి అభయం



వ్యాఘ్రవాహనం పైనుంచి భక్తులను కటాక్షిస్తున్న శ్రీకామాక్షి అమ్మవారి సమేత శ్రీకపిలేశ్వరస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు సోమవారం రాత్రి శ్రీకపిలేశ్వరస్వామి గజవాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి గజవాహన సేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు కదులుతుండగా, కళాబృందాల కోలాటాలు, భజనల నడుమ స్వామి వారి గజవాహన సేవ కోలాహలంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామి, అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు వ్యాఘ్రవాహనంపై కొలువై శ్రీకామాక్షి అమ్మవారి సమేతంగా పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి అశ్వవాహనంపై విహరిస్తూ స్వామివారు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతి ఆవిర్భావ దినోత్సవం



నగర పురవీధుల్లో భక్తి సంకీర్తనలను గానం చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: సాక్షాత్తు కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పాదాల చెంతనున్న తిరుపతి నగరం 895వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక నగరంలో అత్యంత వేడుకగా నిర్వహించారు. గత రెండేళ్లుగా ఫిబ్రవరి 24వ తేదీన తిరుపతి ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రంగస్థలి కళాకారులు పురాణ పురుషుల వేషధారణలో తిరుపతి చరిత్రను చాటేలా ప్లకార్డులు చేతపట్టి వందలాది మంది కళాకారులు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో భక్తి సంకీర్తనలు ఆలపిస్తూ నగర ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి, కళాకారులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం

తిరుపతి అర్బన్: తిరుపతి వేదికగా ఆల్ ఇండియా రైల్వే మాజీ స్టేషన్ మాస్టర్స్ తమ సమస్యలపై పోరాటానికి శ్రీకారం చుట్టనున్నారు. దేశంలోని 575 మంది మాజీ రైల్వే స్టేషన్ మాస్టర్స్ మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పీఎల్ఆర్ గ్రాండ్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం అదే హోటల్‌లో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్‌ఇండియా రైల్వే స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.మురళీధర్, జనరల్ సెక్రటరీ విజయ్‌కుమార్ మాట్లాడారు. ప్రధానంగా 2016లో ఉద్యోగ విరమణ పొందిన రైల్వే స్టేషన్ మాస్టర్స్‌కు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను 2018లో ఇచ్చారని తెలియజేశారు. తమకు సంబంధించి 14 సమస్యలు పరిష్కారం చేయాల్సి ఉందని వెల్లడించారు. 30ఏళ్ల పాటు రైల్వేశాఖలో సేవ చేస్తే.. తమను చిన్నచూపు చూస్తున్నారని చెప్పారు. అందుకే న్యాయం కోసం తిరుమల వేంకటేశ్వర స్వామి వద్ద తొలి సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా రైల్వే స్టేషన్ మాస్టర్స్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు పసుపు రంగు వేస్తారా ?



మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి తుడా: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల కోసం నిర్మించిన ఇందిరమ్మ గృహాలకు జిల్లా కలెక్టర్, అధికారులు పసుపు రంగు వేయడం ఏంటని కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణులతో కలసి ఆయన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా అధికారులు సీఎం చంద్రబాబు వద్ద మెప్పు పొందేందుకు ఇందిరమ్మ ఇళ్లకు పసుపురంగులు వేయడం దారుణమన్నారు. సీఎం దగ్గర మెప్పు పొందాలంటే అధికారులు పసుపురంగు చొక్కాలను ధరిస్తే సరిపోతుందన్నారు. ఇప్పటికైనా తిరుపతి జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు. ధర్నాలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డీన్ చంద్రాయుడిని సస్పెండ్ చేయాలి

తిరుపతి సిటీ: ఓ ప్రైవేటు ఎంబీఏ కళాశాల నుంచి లక్షల రూపాయలు లంచం తీసుకుని మౌలిక సదుపాయాలు బాగున్నాయంటూ నివేదిక ఇచ్చిన ఎస్వీయూ సీడీసీ డీన్ చంద్రాయున్ని తక్షణం సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావును కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకులు, అటెండెన్స్ రిజిస్టర్, అనుమతి లేకుండా కళాశాలను నడుపుతున్నారన్నారు. కళాశాలను సీజ్ చేసి, డీన్ చంద్రాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ వయోపరిమితి వర్తింపు చేయాలి

తిరుపతి కల్చరల్: ఎస్వీయూలో ఇటీవల రిటైర్డ్ అయిన టైంస్కేల్ ఉద్యోగులందరికీ ఉద్యోగ వయోపరిమితి వర్తింపజేయాలని ఎస్వీయూ టైం స్కేల్ రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రిటైర్డ్ టైం స్కేల్ ఉద్యోగులు డీఎం.విజయచందర్, రెడ్డెప్పరెడ్డి మాట్లాడారు. ఎస్వీయూలో గత 30 ఏళ్లుగా 250 మంది నాన్ టీచింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్నామని తెలిపారు. సమస్యపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించి 9 నెలలు కావొస్తున్నా పట్టించుకోలేదని వాపోయారు.

ఉత్సాహంగా క్రీడా సాంస్కృతిక పోటీలు



క్యారమ్స్ పోటీల్లో మహిళా అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల వేదికగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌జీ రంగా వర్సిటీ అధ్యాపక క్రీడా సాంస్కృతిక పోటీలు సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. వర్సిటీ పరిధిలోని 5 కళాశాల నుంచి విచ్చేసిన 200 మంది అధ్యాపకులు, శాస్త్రవేత్తలు క్యారమ్స్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్, రన్నింగ్, షాట్ పుట్ పోటీల్లో తలపడ్డారు. అనంతరం పాటల పోటీల్లో మహిళా అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్, అసోసియేట్ డీన్ ఎంవీ రమణ, ఎంఎస్‌వీ చలం, రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు

కనుల పండువగా రథోత్సవం



చంద్రగిరి: మండల పరిధిలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామివారి మహాశివరాత్రి ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం పార్వతీ, పరమేశ్వరులు రథోత్సవంపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. రథోత్సవంలో స్వామి, అమ్మవార్లు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అనంతరం రాత్రి కామధేను వాహనంపై ఊరేగారు.

చదరంగంలో ప్రతిభ



జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించిన నందన్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి యూత్ హాస్టల్ ఆవరణలో ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. పుత్తూరుకు చెందిన మునిరెడ్డివారి నందన్ అండర్–15 విభాగంలో పాల్గొని మొదటి స్థానం సాధించాడు. ఈ సందర్భంగా నందన్‌ను టోర్నమెంట్ డైరెక్టర్ శివకేశవులు, చెస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ అభినందించారు.